**నిరుద్యోగిగా వున్నప్పటి ఆలోచనలు వేరు. అదే మనిషి ఉద్యోగి అయినప్పటి హోదా వేరు! అందుకు తోడు అనుకున్న అంచనాకి అవతలి వ్యక్తి రాలేదని తెలుసుకుంటే అందమూ లేదు. అభ్యుదయమూ లేదు. అప్పుడూ ఇప్పుడూ వున్న సూత్రం వొక్కటే! అదే ఆర్థిక సూత్రం!**



# పురుషసూత్రం

హరనాధరావు

**ఉ**దయం పది గంటలు కావస్తోంది.

ఆఫీసులు, స్కూళ్ళు. హడావుడిగా రోడ్లమీద పరిగెడుతున్నాయి టయిమయిందన్న భయంతో. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎండను బూతులు తిడుతున్నాడు మండి పోతున్న సూర్యుడ్ని లాకప్‌లో తోసేద్దామని పిస్తోంది.

ఆ స్కూలు కెదురుగా సుబ్బరాజు అలవాటుగా చేరాడు.

సుబ్బరాజు కాలేజీనుంచి బైటకొచ్చి నాలుగేళ్ళయింది. తల్లి కడుపునుంచి బైటకొచ్చి పాతికేళ్ళయింది. ఎంప్లాయిమెంటులో తను బ్రతికి వున్నానని వ్రాయించుకొని నాలుగేళ్ళయింది.

ఆ వేపచెట్టుక్రింద నిలబడి ఆశలను అల్లుకుంటూ వుంటాడు.

స్కూలు బెల్లు కొట్టారు.

రోడ్డువైపు చూపులు పారేశాడు.

పంతులమ్మ ఇంకా రాలేదు.

ఆరు నెలలనుంచి ఆమెతో పరిచయం. ఆమె చూపులతో. ఆమె నడకతో. ఆమె మీది ఆశతో. కానీ తనెప్పుడూ మాట్లాడలేదు. ఆ రోడ్డులో వన్‌వే ట్రాఫిక్ వుంది. దాన్ని తనూ అనుసరించాడు.

పంతులమ్మ తనకంటే రెండు మూడేళ్ళ చిన్నదిలావుంది. ఆమె కాలికి మెట్టెలు లేవు. కాబట్టి ఆమెను ప్రేమించడంలో తప్పులేదు. పంతులమ్మ కొద్దిగా లావుగా వుంటుంది. అయితే మాత్రం- ఆమెకు పెళ్ళికాదా! సినిమాల్లో లావుపాటి హీరో యిన్నుంటే ఆ సినిమా వందరోజులు ఆడుతోంది. 'లావు'మీద ప్రజాభిప్రాయ సేకరణకు ఇంతకంటే ఏం మార్గం కావాలి

"కానీ- ఆమె నలుపుగా వుందోయ్" అంటాడు మనసుగాడు.

ఆ మాటకు సుబ్బరాజు నవ్వి- "నల్లగా వుంటేనేం. అసలు అందం నలుపులోనే వుంటుంది. నల్లటివారి ముఖంలో కళ కొట్టవచ్చినట్లుంటుంది. రంగునేం కొరుక్కు తినం. నల్లటివారు ఆలోచనాపరులంటారు. వంటి రంగుకాదు ప్రధానం. గుణం రంగు.

మనసు ముఖాన్ని నల్లబుచ్చుకుంది.

పంతులమ్మ హడావుడిగా వస్తోంది. రథం దిగిన యువరాణిలా వుంది. దిగుమతయిన కారు నుంచి దిగిన స్వదేశీ సుందరిలా వుంది. కట్టిన తెల్లచీర ఆమె వంటికి మరింత అందం తెచ్చింది.

స్కూలు గేటులో అడుగుబెడుతూ తనను చూసింది.

పోలీసువాడు వన్ వే ట్రాఫిక్‌లో వచ్చినందుకు ఎవరినో పోలీసు భాషలో తిడుతున్నాడు

— ఆమెను చూడలేక సిగ్గుపడ్డాడు.

సాయంత్రం దాకా పంతులమ్మ బైటకురాదు. సాయంత్రం అలసిపోయిన ముఖంతో బైటకు వస్తుంది

ఆ సమయానికి సుబ్బరాజు మళ్ళీ చేరతాడు.

పెళ్ళి చేసుకుని భర్తతో షికారుకు బయలుదేరవలసిన సమయంలో ఆమె విసుగ్గా ఒంటరి జీవితాన్ని తిట్టుకుంటున్నట్లుగా వస్తుంది

ఆఫీసునుంచి ఇంటికి వెళ్తూ మల్లెపూలు ట్లం కటించుకుని వెళ్ళవలసిన సమయంలో ఒంటరిగా వేపచెట్టుక్రింద నిలబడవలసిన దుస్థితి.

"నీకూ నీ వారులేరు" అన్నట్లుంటుంది ఆమె చూపు. "నాకూ నావారు లేరు" అంటుంది ఇతని వయసు.

ఆమె కంటికి దూరం అవుతున్నది.

చూపులకందే దూరంలో ఆమెను అనుసరించాలి ఆమె ఇంటిదాకా. ముసలి తల్లితో ఆ చిన్న పెంకుటింటో అదెకుంటున్నది ఆ వీధి మలుపు వరకే తనకు హక్కు.

సుబ్బరాజుకు పంతులమ్మ కలలోకి రోజూ వస్తుంది. ఆమె స్కూలుకు సెలవు పెట్టినా కలలోకి రాను మాత్రం ఎపుడూ సెలవు పెటలేదు

సుబ్బరాజుకు జీవితంమీద విసుగుంది. ఉద్యోగం లేదని కాబోలు. తను ఆడపిల్లల తండ్రులకు పనికిరాని వాడయ్యాడు. ఈ ఆడపిల్లల తండ్రులు పరమ దుర్మార్గులు. ఆస్తి, ఉద్యోగంవుంటే కుక్కవేషం వేసుకుని ఇంటి ముందు దసరా పండుగ చేస్తారు. కట్నాలను ప్రోత్సహించేది వీరే. నిరుద్యోగులకు తమ పిల్లలనిచ్చి పెళ్ళిచేసి కట్నం ఇవ్వకుండా ఆ డబ్బుతో ఇంటర్వ్యూలకు పంపిస్తే, ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వవలసిన అవసరం ఏముంది? వరకట్న సమస్యను, నిరుద్యోగ సమస్యను ఈ విధంగానైనా ఎదుర్కోవచ్చును. ప్రజలు సుబ్బరాజు అభిప్రాయాలు తెలుసుకుంటే అసెంబ్లీకి విసిరేసేవారు.

తనకు ఉద్యోగం లేదు.

ఎంప్లాయిమెంటు వాడెపుడూ పెళ్ళికాని ఆడపిల్లల తండ్రిలా వుసూరుమంటాడు. నిరుద్యోగం అంటే ఆ ఆఫీసులో ఎవరికీ లెక్కలేదు. నిరుద్యోగులందరూ వారి కళ్ళకు ఆస్తి పంచివ్వమనే కొడుకుల్లా, నీ గర్భం సంగతి నాకు తెలియదనే ప్రేమికుల్లా, ఫీజు ఇవ్వకుండా రోగం గురించి చెప్పే రోగుల్లా కనిపిస్తారు. వాళ్ళ ఉద్యోగాలు ఓ సంవత్సరంపాటు పీకేస్తే, నిరు

రాజ్యానికే శోభ చార్మినార్ మీ ఇంటికే శోభ చార్మినార్ పెయింట్




ఎల్లప్పుడూ వాడండి
చార్ మినార్ పెయింట్స్
గోల్డ్ స్టార్ సూపర్ సింథటిక్ ఎనామిల్
చార్ మినార్ గ్లాస్ ఎనామిల్
చార్ మినార్ ఎనమలైజ్డ్
సింథటిక్ వుడ్ ప్రైమర్
తయారుచేయువారు:
ది ప్రమీలా ఎంటర్‌ప్రైజెస్
విజయవాడ-520001. ఫోన్: 61783

ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతుల మీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20, 000 లేక ఆపైన ఋణం లభించును

వ్రాయండి లేదా సంప్రతించండి ఫోన్ : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory
Tredeo Road, BOMBAY-400 034

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో


చక్కటి అవకాశం ది 1-12-78 నుండి త్వరపడండి

VIMAL
A RELIANCE PRODUCT

రు. 15000 ల
విలువైన 400 ల బహుమతులు

సంక్రాంతి సంబరమునకు సరదాగల విమల్ వస్త్రములు, సూటింగులు, షర్టింగులు, డ్రస్ ఫ్యాబ్రిక్స్‌లు 100% పోలిష్టరు శారీసులు అందమైన మీకు ఆనందానుభూతులను వెదజల్లె విమల్ వారి వస్త్రములను ఖరీదుచేసి ప్రతి 50 రూపాయలకు ఒక బహుమతి కూపను పొందండి.

ఆరాధన విమల్ షోరూం
కొత్తగూడెం.




కొత్త ధాన్యమ్ము నూర్చిన కుప్పనుండి
ఇండ్ల పైకెత్తుచున్న పంటలను చూడ
లోగిళ్ళలో వెల్లువెత్తగ సంక్రాంతి లక్ష్మి!

ఫొటో : ఎన్. శివన్నారాయణ, గుంటూరు-2

ద్యోగం బాధేమిటో అపుడు తెలుస్తుంది. అపుడయినా ఆఫీసు కొచ్చిన నిరుద్యోగులను అడుక్కునే వాళ్ళుగా చూడడం మానేస్తారు.

వంతులమ్మ మాత్రం వుద్యోగం సంపాదించింది. కొంపదీసి షెడ్యూల్డు కులం కాదుగదా! అయితేనేం తనకూ అభ్యుదయ భావాలున్నాయి. ఎన్ని అడ్డంకులొచ్చినా తన ఆశయాలను వదులుకో కూడదు కానీ ఆమె తన కులం మనిషేనని తెలిసినప్పటినుంచి ఈ దేశం తనత్యాగాన్ని అభ్యుదయాన్ని, తన డైరీలో వ్రాసుకోలేకపోయినందుకు బాధపడ్డాడు.

వంతులమ్మను పెళ్ళిచేసుకుంటే తనకు ఉద్యోగం రాకపోయినా ఫరవాలేదు. ఉద్యోగం పురుష లక్షణం అన్న ఛాదస్తాన్ని కొట్టివేసిన సంస్కర్తగా తన పేరు నిలవాలి నెలకు ఆరొందలొస్తాయి- ఆమెకు




ఉద్యోగం లేని ఆడపిల్లను పెళ్ళిచేసుకుంటే ఐదువేలు కట్నం ఇచ్చేసరికి ఏడుస్తారు. ఆమెను చేసుకుంటే తనకు లక్ష రూపాయలు పైగా కట్నం వచ్చినట్లు లెక్క. ఆమె నెల జీతం, ఆమెతో కాపురం చేయవలసిన నెలలతో హెచ్చిస్తే వచ్చినంత డబ్బును ఎవరూ తనకుకట్నంగా ఇవ్వరు.

ఆమె స్కూలుకు వెళ్ళను. తనే శుభ్రంగా వుదయమే లేచి కాఫీపెటి ఇంత అన్నం, కూరలూ వుడకేస్తే భోజనంచేసి వెళ్ళిపోతుంది. ఆమె వెళ్ళిపోగానే తనూ నాలుగు మెతుకులు కొరికి, వంటిల్లు కడుక్కుని, ఏ మ్యాట్నీ సినిమాకో, లేకపోతే ఏ వార పత్రికలో ఆడవాళ్ళ సీరియల్లో చదువుకుంటూ విశ్రాంతి తీసుకోవచ్చు. ఇంతకంటే హాయి తను వుద్యోగం చేస్తే మాత్రం వస్తుందా!

ఇదో రకమైన విప్లవం.

అవకాశంవుంటే దీనికి పెద్ద ఎత్తున ప్రచారంచేస్తే, తనకు మంచి పేరు. అభ్యుదయవాదన్న బిరుదు లభిస్తాయి. మహిళా మండలి వారు 'ఆధునిక భార్య' అని బిరుదిచ్చి సత్కరించే అవకాశం లేకపోలేదు. అవకాశం వుంటే ఓ నెల వారపత్రికలు చదివిన జ్ఞానంతో ఓ నవల రాసి పంతులమ పేరుతో పోస్టు డబ్బాలో పారేస్తే. అదృష్టం బాగుంటే దాన్నే సినిమాతీసి జనంమీద పారేసే అవకాశం లేకపోలేదు.

ఎవరయినా ఎగతాళి చేస్తే? ఆడదాని సంపాదన తింటున్నాడని ఆటలు పట్టిస్తే? మనసుగాడు అన్నాడు.

సుబ్బరాజు విసుక్కున్నాడు. మనసుగాడిమాటలు విని వాడ్ని అరచేత్తో నొక్కిపట్టాడు.

ఏమిటీ వెధవ గోల. లాజిక్కు తెలియకుండా మాట్లాడుతున్నాడు. దేశంలో ఆర్థిక అసమానతలు తొలగాలని చెప్పిన పెద మనిషి, రిక్షాదిగి రూపాయి బదులు అర్ద రూపాయి చేతిలోపెటి. నేను మాట్లాడింది అంతే అంటే అసమానతలు ఎలా తొలగుతవి. అందుకని సృష్టికి మూలం నుంచే తను ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాడు. భర్త సంపాదన మీద ఆధారపడిన భార్య-వాడేం చేసినా పడుతుంది. తిడితే మల్లెపూల చెండుపెట్టి కొడుతుంది. బైటకు నెడితే భర్తే దైవం అని తులసికోట చుట్టూ తిరుగుతుంది. దీనికి కారణం?—

భార్యాభర్తల మధ్య ఆర్థిక వ్యత్యాసమే దీనికి కారణం. ఒక కుటుంబంలో తొలగని ఆర్థిక వ్యత్యాసం, దానికి జరుగుతున్న బానిసత్వం దేశంలో తొలగాలని ప్రయత్నించడం అవివేకం. దానికి

నివారణ తన దగ్గర వుంది. భారత స్త్రీ సీతమ్మకు చెల్లెలు. అనసూయమ్మకు మరదలూ కాబట్టి మొగుడికి ఎదురు తిరగలేదు. అందుకని ఆ సమ్మకంతేత భర్తమాట వింటుంది. తను సంపాదిస్తున్నా, సంపాదనలేని భర్తకు సమాన గౌరవం ఇస్తుంది. ఒక రకంగా ఒక కుటుంబంలో ఆర్థిక సమానత్వం పరస్పరమైన గౌరవం సంపాదించగలిగితే, దేశంలో ఆర్థిక అసమానత అనేది కొంతయినా రూపుమాపను అవకాశం కలుగుతుంది.

యజమానిగారి అజ్ఞానానికి మనసుగాడు మానసికంగా దెబ్బతిన్నాడు.

అకస్మాత్తుగా ఓరోజు ఎంప్లాయిమెంటు వారు పిలిచారు. అక్కడి నిరుద్యోగులు గడ్డాలు లేని సన్యాసుల్లా వున్నారు. గడ్డాలున్నవారు వేదాంతుల్లా వున్నారు. రెన్యువల కౌంటర్ దగ్గరి గుమాస్తా బీదలకు అన్నదానం చేస్తున్న ధనికుడిలా వున్నాడు గేటు దగ్గరి జవాను ఏం వాలు మరిగిన స్వతం యజమానిలా వున్నాడు.

సుబ్బరాజుకు ఇంటర్వ్యూ కార్డు అందచేశారు.

రేషను కార్డులు పట్టుకున్న పరంధామయ్యలు. ఎరువుల కార్డులు పట్టుకున్న ఎర్రయ్యలు. పాల కార్డులు పట్టుకున్న పరమేశంగార్లు. నడిచిన. నడుస్తున్న. నడవబోయే రోడ్డుమీద ఎంప్లాయిమెంటు కార్డు పట్టుకుని నడుస్తున్నాడు సుబ్బరాజు.

ఆ రోజు వేపచెట్టు క్రింద నిలబడి పంతులమ్మను చూసే అవకాశం కలుగలేదు. తన అభ్యుదయ భావాలు కనిపెట్టి మరెవడయినా తన శిష్యుడిలా అక్కడ నిలబడితే-అన్న దిగులు సుబ్బరాజుకు లేకపోలేదు.

మర్నాడు ఇంటర్వ్యూ-

ఎదుటివాడు పనికిమాలిన వాడని వేసిన ప్రశ్నలు మొదలు. తను వట్టి తెలివి తక్కువవాడని నిరూపించుకునే వరకూ ఆఫీసరు సుబ్బరాజును వదల్లేదు. కుక్కకెన్ని గోళ్లు, ఆడవాళ్ళే అన్ని నవలలు ఎలా వ్రాయగలుగుతున్నారు? లాటి ప్రశ్నలు వేసి సుబ్బరాజు తెలివి తేటలు పరీక్ష చేశారు.

సుబ్బరాజుకు ఉద్యోగం వచ్చింది.

ఉన్న వూరికి కొద్ది దూరంలో వేశారు. పంతులమ్మ సుబ్బరాజుకు దూరమయింది. పంతులమ్మ వేపచెట్టువైపు చూడటం మానలేదు.

ఆదివారాలు వచ్చినపుడు సుబ్బరాజు వేపచెట్టు క్రింద నిలబడి గోడ్రాలి మనసులా వున్న "ఆదివారం స్కూలు"ను చూడటం మానలేదు.

ఆ వియోగానికి లైలా మజ్నూలు, సలీం అనార్కలీలు, ఎంకీ నాయుడు బావలు, ఆ వేపచెట్టు క్రింద సంతాప తీర్మానం ఆమోదించారు.

మేనమామ శివకామయ్య సుబ్బరాజుకు సంబంధాలు తెస్తున్నాడు. మనసు పంతులమ్మమీద వుంది. ప్రేమంటే ఏమిటో నేర్పింది. అందులోని వియోగంలోని బాధేమిటో తెలియచెప్పింది.

తను త్రాగుడు నేర్చుకుంటేగాని ఆమె తనను వెదుక్కుంటూ రాదా? రక్తం కక్కపాట పాడితేగాని ఆమె మనసు కరుగదా? ఛీ. ఛీ—ఈ ఆడవారి హృదయాల్లో తెలుగు సినిమా సెంటిమెంట్లు ప్రవేశించాయి —అనుకున్నాడు.

మేనమామ సైన్యాధిపతిలా వున్నాడు. పంతులమ్మను బంధించిన మాయల పకీరులా వున్నాడు. అందుకే స్టాంపులా అమ్మాయిని పెళ్ళిగోల చేస్తున్నాడు.

ఆ గోల భరించలేక సరేనన్నాడు. పెళ్ళిచూపుల ఏర్పాట్లు పూర్తయ్యాయి ఫలాన రోజు వచ్చింది.

ఎదురుగ్గా పంతులమ్మ! తను ప్రేమించిన పంతులమ్మ. తను తపించిన పంతులమ్మ. తనను మురిపించిన పంతులమ్మ.

పంతులమ్మ తలెత్తి చూసింది.

ఆ కళ్ళు ఆ శరీరంలో వెలిగించిన దీపాల్లా వున్నాయి. ఆ కళ్ళలో చూపులు తన కాళ్ళను తాకాయి గౌరవంగా. బుగలను తాకాయి ప్రేమగా గుండెలకు గుచ్చుకున్నాయి వాడిగా.

సుబ్బరాజు ఆనందం పటలేకపోయాడు.

పంతులమ్మకు ముసలి తల్లితప్ప మరెవరూ లేరట. ఆస్తిపాస్తులు లేవట.

మేనమామ శివకామయ్య. పంతులమ్మ తల్లి ఏకనామిక్సులో మాట్లాడుకుంటున్నారు.

ఆ రాత్రి ఇంటి దగ్గర మేనమామ చెప్పాడు. కట్నం ఐదువేల కంటే ఇచ్చుకోలేరట. ఆ అమ్మాయి మొన్నటిదాకా సెలవు పోస్టులో పని చేసిందట. ప్రస్తుతం ఖాళీగా వుందట.

సుబ్బరాజు విన్నాడు.

పాపం - పంతులమ్మకు వుద్యోగం లేదా!!

తనేం పనికిమాలిన వెధవగా కనిపించాడా! నెలకు ఆరొందలు తెచ్చుకొంటున్నాడు. పిచ్చి వెధవగా ఐదువేలకు అమ్ముడుపోయే అమాయకుడనుకున్నారా! ఈ రోజుల్లో ఉద్యోగాలు అంతసులభంగా దొరుకుతున్నవా! అందులో ఆమె ఉద్యోగం చేసి ఏం వుద్ధరిస్తుందట ఆడది ఉద్యోగం చేస్తే మాట వినదమే? మొగుడి చెవులకు బొక్కలువేసి. తాళ్ళుకటి బొచ్చు కుక్కలా వెంట తిప్పదూ. అందులో ఆమె పంతులమ్మ. అయినా మాత్రం ఏం బావుంది. నల్లగా, లావుగా, గున్న ఏనుగు పిల్లలా వుంటుంది. ఆమెను వెంబడి పెట్టుకుని నడిస్తే, దేవస్థానం ఏనుగులా ఆమె, దాన్ని మేపేవాడిగా తనూ రోడ్డుమీద కొస్తే పరువేం కావాలి. రిక్షావాళ్ళు మాట వింటారా! సినిమావాళ్ళు టిక్కెట్లిస్తారా? సుబ్బరాజు నవ్వుకున్నాడు.

ఆ మర్నాడు పంతులమ్మ ఇంటికి మాట్లాడను పోతూ మేనమామ అన్నాడు.

"సరేరా నీ మాట ప్రకారమే ఇరవైవేలు కట్నం ఇవ్వగలమంటేనే సెటిల్ చేస్తాను."


## ఉబ్బసానికి మూలిక

ఉబ్బసాన్ని తగ్గించే మూలిక ఒకటి రాజస్థాన్ వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ శంభునాథ్ గారి మనుమడు శ్రీ కేశవ మోహన్ లాల్‌చే (పేదవారికి) పంచిపెట్టబడుతున్నది.

ఈ మూలికను ఒక సన్యాసి శ్రీ శంభునాథ్‌కు ఇచ్చారు. నలభై సంవత్సరాలకు పైగా ఆయన ఉచితంగా పంచిపెట్టారు. ఆయన నిస్వార్థ సేవకు మెచ్చి ప్రభుత్వం పింఛను ఇచ్చింది. ఈ సత్కార్యాన్ని తన మనుమనికి అప్పగించి ఆయన సన్యాసి ఆశ్రమము స్వీకరించెను. ఇప్పుడు ఆయన మనుమడు ఈ కార్యభారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే భాగ్యవంతులకు ఈ సత్కార్యానికి విరాళ మీయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకమంది ఉబ్బసం రోగులు దీర్ఘకాలవ్యాధి పీడితులు కూడా ఈ మూలిక మూడు మోతాదులు సేవించి ఉపశమనం పొందారు. రోగులు ఈ మూలిక కోసం ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

శ్రీ కేశవ మోహన్‌లాల్
పో. బా. నెం. 11463. కలకత్తా-6.


RIPNT TAR/IC